క్లుప్తంగా

నేడు జంగుబాయి ఆలయంలో దీపోత్సవం

కెరమెరి: జంగుబాయి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆదివాసీలు భక్తిశ్రద్ధలతో దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఆదివాసీల సాంప్రదాయబద్ధంగా నేడు సాయంత్రం 7 గంటలకు ఎనిమిది గోత్రాలకు చెందిన కటోడాలు, ఆదివాసీలు జంగుబాయి ఆలయ సన్నిధిలో కొలువుదీరిన దేవతా విగ్రహాలను టొప్లకస నుంచి తీసుకొచ్చిన గంగాజలంతో శుద్ధి చేసి, రావుడ్, పోచమ్మ ఆలయంలోని ప్రతిమలకు ప్రత్యేక పూజలు చేయనున్నారు. అనంతరం అమ్మవారి గుహకు చేరి దీపం వెలిగిస్తారు. ఈ దీపం నెలరోజులపాటు వెలుగుతూనే ఉంటుంది. ఇప్పటికే ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

వాసవీక్లబ్ అధ్యక్షుడికి సన్మానం



సన్మానిస్తున్న అలీబిన్ అహ్మద్

ఆసిఫాబాద్: వాసవీ క్లబ్ నూతన అధ్యక్షుడిగా ఎంపికైన పట్టణానికి చెందిన కొలిప్యాక శంకర్‌ను శనివారం సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్ జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో శాలువాతో సన్మానించారు. ఆదివాసీ నాయకులు వెడ్మ బాదు పటేల్, కుమ్రం దేవరావు, గెడెకర్ నానాజి ఉన్నారు.

పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

దహెగాం: సంక్రాంతి పండుగ ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్సై సనత్‌కుమార్ అన్నారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాల్లో కోడి పందెలు, పేకాట ఆడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గాలిపటాలు ఎగురవేసే వారు జాగ్రత్తలు పాటించాలని, ఇళ్ల మేడలపై ఎగురవేయ వద్దని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అయోధ్య అక్షింతలు పంపిణీ



శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని మోతుగూడ, బూర్గుడ, రాజుర, ఈదులవాడతో పాటు పలు గ్రామాల్లో శనివారం అయోధ్య అక్షింతలతో శోభాయాత్ర నిర్వహించారు. రాముని పల్లకిలో బ్యాండుమేళాతో వాడవాడలా తిరుగుతూ శ్రీ రాముని అక్షింతలు ఇంటింటికీ పంపిణీ చేశారు. మోతుగూడ సర్పంచ్ సువర్ణ, మాధవి, భీమేష్, భక్తులు ప్రభాకర్, రాజయ్య, వినోద్, తిరుపతి, దాదాజీ, అన్నారావు మహిళలు పాల్గొన్నారు.

బోర్‌వెల్ ఏర్పాటు



బోర్‌వెల్ పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

రెబ్బెన: గోలేటి గ్రామ పంచాయతీ పరిధి భగత్‌సింగ్‌నగర్‌లో విఘ్నేశ్వర మండలి వద్ద శనివారం నూతన బోర్‌వెల్ ఏర్పాటు పనులను సర్పంచ్ పోటు సుమలత ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ విఘ్నేశ్వర మండలి వద్ద తాగునీటి సౌకర్యం కోసం నూతన బోర్‌వెల్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వార్డు సభ్యులు ఎర్ర స్వప్న, నాయకులు కుమ్మరి మల్లేష్, సంతోష్, సత్తయ్య, శంకర్, పరదేశి, నారాయణ, వెంకటేష్, రవి, సుమన్ పాల్గొన్నారు.

15 నుంచి 'పాల్వాయి' క్రికెట్ పోటీలు

చింతలమానెపల్లి: మండలంలోని రవీంద్రనగర్‌లో ఈనెల 15 నుంచి దివంగత మాజీ ఎమ్మెల్యే పాల్వాయి పురుషోత్తమరావు స్మారక క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహక కమిటీ అధ్యక్షుడు ఇంద్రజిత్ మండల్, ప్రధాన కార్యదర్శి పరేశ్ కవిరాజ్ తెలిపారు. నేతాజీ యూత్ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

టోర్నమెంట్ ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న కిరణ్‌రాథోడ్

లింగాపూర్: శ్రీ జగదాంబదేవి జాతర సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం మండల కేంద్రంలో గ్రామ నాయక్ కిరణ్‌రాథోడ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామాల యువత క్రీడల్లో రాణించాలన్నారు. జాదవ్ జాదు, రమేశ్, వినోద్, కైలాష్, హాసిరాం, గంగు పటేల్, సకారాం తదితరులు పాల్గొన్నారు.

ఇష్ట దేవతలకు ప్రత్యేక పూజలు

- నేడు ఓంరాజ్ వంగెపురి భీమయ్యక్ స్వామికి..
- రేపు రాజుల్ దేవునికి పూజలు
- హాజరుకానున్న కొలాం ఆదివాసీలు



గ్రామానికి చేరిన రాజుల్ దేవత



కొలువైన వంగెపురి భీమయ్యక్ స్వామి

కెరమెరి: సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవడంలో ఆదివాసీలు ఎప్పుడూ ముందుంటారు. ఏటా పుష్య మాసంలో ఎన్నో రకాల పండుగలు జరుపుతూ తమ సంస్కృతిని కాపాడుకుంటున్న కొలాం ఆదివాసీలు ఈ మూడు రోజుల పాటు తమ ఇష్ట దేవతలకు మొక్కులు చెల్లించనున్నారు.

మూడు రోజులపాటు పూజలు

మండలంలోని జోడేఘాట్ గ్రామ పంచాయతీ పాట్నాపూర్ గ్రామంలో కొలువైన ఓంరాజ్ వంగెపురి భీమయ్యక్ స్వామి, రాజుల్ దేవతలకు ఆదివాసీలు మూడు రోజులు ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఆదివారం రాత్రి 8:30 గంటలకు ఓం రాజ్ వంగెపురి భీమయ్యక్ స్వామికి మహాపూజ జరుపనున్నారు. 15న రాజుల్ దేవతలకు సాయంత్రం 7 గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 16న మండ గాజ్లి, ముగింపు కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆదివాసీలు పూజల నేపథ్యంలో శుచి, శుభ్రత పాటించి కుల దైవానికి మొక్కులు తీర్చుకుంటారు. సమీప గ్రామాలతో పాటు ఇంద్రవెల్లి, ఉట్నూర్, ఆదిలాబాద్, కెరమెరి, వాంకిడి, దండేపల్లి, లింగాపూర్, సిర్పూర్(యూ), సిర్పూర్(టి), ఇచ్చోడ మండలాల్లోని అనేక గ్రామాలతో పాటు, మహారాష్ట్రకు చెందిన వందలాది మంది భక్తులు ఇక్కడికి వచ్చి తమ మొక్కులు చెల్లించుకోనున్నారు.

కొత్త కోడళ్ల భేటింగ్

నేటి నుంచి నుంచి 16 వరకు ఇష్ట దేవతలకు ప్రత్యేక పూజలు జరగనున్నాయి. ఈ సందర్భంగా కొత్త కోడళ్ల భేటింగ్ కార్యక్రమం ఎంతో ఉత్సహంగా నిర్వహిస్తారు. తెల్లటి చీరలను ధరించి కోడళ్లు వాయినాలు ఇచ్చుకుంటారు. వంగెపురి భీమయ్యక్, రాజుల్ దేవతలకు సమష్టిగా పూజలు చేస్తారు. అనంతరం పెద్దల ఆశీర్వాదం స్వీకరిస్తారు. ఇది తాతముత్తాల నుంచి వస్తున్న ఆచారమని, కొలాం తెగలో ఉన్న కొత్త కోడల్లు భేటింగ్ కావడం వారి సాంప్రదాయంగా భావిస్తారు. పూజలకు ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి హాజరు కానున్నారు.

గతంలో మూడేళ్లకోసారి..



గతంలో మూడేళ్లకోసారి ఈ ఉత్సవాలను నిర్వహించే వాళ్లం. కాని రెండేళ్ల క్రితం ఏటా నిర్వహించాలని నిర్ణయించాం. మూడేళ్లకు ఒకసారి అగ్ని గుండంలో నడిచే కార్యక్రమం ఉంటుంది. ఈ ఏడాది ఆ కార్యక్రమానికి స్వస్తి పలికాం.

- సిడాం భీంరావు, పాట్నాపూర్

భక్తులు తరలిరావాలి



నేటి నుంచి మూడు రోజుల పాటు పాట్నాపూర్ గ్రామ సమీపంలో ఉన్న ఆలయంలో నిర్వహించే పూజలకు కొలాం ఆదిమ గిరిజనులు వచ్చి తమ మొక్కులు తీర్చుకుంటారు. దేవతలకు మొక్కితే కోరికలు నెరవేరుతాయని నమ్ముతున్నాం.

- ఆత్రం భీంరావు, పాట్నాపూర్

'పీఎం జన్‌మన్' సర్వే పొడిగించాలి



మాట్లాడుతున్న సిడాం ధర్మూ

కెరమెరి: పీఎం జన్‌మన్ సర్వేను ఈ నెల 20 వరకు పొడిగించాలని కొలాం సంఘం మండలాధ్యక్షుడు సిడాం ధర్మూ డిమాండ్ చేశారు. అనేక మందికి కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు అందుబాటులో లేవని, తహసీల్దార్ కార్యాలయాలకు కూడా సంక్రాంతి సెలవులు కావడంతో అధికారులు అందుబాటులో ఉండడం లేదన్నారు. అధికారులు స్పందించి సర్వే కాలాన్ని ఈనెల 20 వరకు పొడిగించాలని కోరారు. కార్యక్రమంలో సిడాం భీంరావు, ఆత్రం భీంరావు, సిడాం భీము ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్న రేషన్ బియ్యం

కాగజ్‌నగర్‌రూరల్: తాండూర్ మండలం నుంచి మహారాష్ట్రకు పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా శనివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపిన వివరాల ప్రకారం తాండూర్ మండలం నుంచి మినీ వ్యాన్‌లో మహారాష్ట్రకు తరలిస్తున్న 9 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని కాగజ్‌నగర్ మండలం వంజీరి వద్ద పట్టుకున్నామని తెలిపారు. ఈ మేరకు బియ్యాన్ని తరలిస్తున్న సర్‌సిల్క్ కాలనీకి చెందిన విరపనేని కిషోర్‌పై కేసు నమోదు చేసినట్లు 9 క్వింటాళ్ల బియ్యాన్ని కాగజ్‌నగర్ రూరల్ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ ఎస్సై సందీప్‌కుమార్, సిబ్బంది మధు, రమేశ్, సంజీవ్ పాల్గొన్నారు.

నేడు దొనబండలో ముగ్గుల పోటీలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం దొనబండ గ్రామంలో స్థానిక మహిళలు, యువతులకు ఆదివారం సంక్రాంతి పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో గెలుపొందే మహిళా విజేతలకు మొదటి బహుమతి రూ.రెండు వేలు, రెండో బహుమతి రూ.1,500, మూడో బహుమతిగా రూ.వెయ్యి నగదు ప్రోత్సాహలను అందజేయనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే మహిళలు ఉదయం 10గంటల లోపు దొనబండ ప్రభుత్వ పాఠశాల మైదానంలోకి ఎవరి ముగ్గులకు సంబంధించి కలర్లు, ఇతర అవసరాలను వెంట తీసుకోవచ్చాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ యువత అధ్యక్షుడు రేవెల్లి ప్రసాద్, గ్రామ కమిటీ అధ్యక్షుడు తనుగుల సత్యాగౌడ్, స్థానిక నాయకులు సందరాజుల వెంకటస్వామి, పిట్టల గోపాల్, దోసారపు సత్యంగౌడ్, పాలాస రంజిత్ ఆధ్వర్యంలో ఈ ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

భక్తుల కొంగు బంగారం 'గొంతెమ్మ'



మెరెగూడ సమీపంలో వెలసిన గొంతెమ్మ తల్లి

- గౌతమి చెరువు ప్రాంతంలో వెలసిన ఆలయం
- భక్తుల కోరికలు తీర్చే కల్పవల్లి
- బోనాలకు ఏర్పాట్లు

పెంచికల్‌పేట్: పచ్చని ప్రకృతి ఒడిలో మేరెగూడ గ్రామంలోని గౌతమి చెరువు సమీపంలో వెలసిన అతి పురాతన గొంతెమ్మ (కుంతి దేవి) ఆలయంలో బోనాల పండుగను సోమవారం నిర్వహించేందుకు గిరిజనులు ఏర్పాట్లు చేస్తున్నారు. వేల ఏళ్ల క్రితం వెలసిన గొంతెమ్మ తల్లి భక్తుల కోరికలను తీర్చే కల్పవల్లిగా విరాజిల్లుతోంది. ఏటా ఆలయంలో 15 రోజుల పాటు గిరిజనులు ఎంతో భక్తిశ్రద్ధలతో బోనాలు, జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

గ్రామ దేవతల ఊరేగింపు..

ఆలయంలో గొంతెమ్మతో పాటు పంచపాండవులు, నీలవరుడు, పోతురాజు, లక్ష్మీదేవర, కృష్ణస్వామి, గిరిపోతుల విగ్రహాలు కొలువుదీరాయి. జాతరలో భాగంగా ఈ విగ్రహాలను మండలంలోని అగర్‌గూడ, ఎల్లూర్, కోయచిచ్చాల, పెంచికల్‌పేట్, ఎలకపల్లి, సంజీవనగర్, లోడుపల్లి గ్రామాల్లోని వీధుల్లో ఊరేగించారు. ఆయా గ్రామాల్లోని ప్రజలు అమ్మవారు చల్లగా చూడాలని సారెను అందించారు. ప్రతిరోజు సాయంత్రం గ్రామంలో అమ్మవార్ల వేషధారణలో భాజాభజంత్రీలతో ఆటపాటల ద్వారా ఆలయ చరిత్రను, అమ్మవార్ల మహిమను భక్తులకు వివరించారు.

సిద్దేశ్వర ఆలయంలో పవిత్ర స్నానాలు..

గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించిన అనంతరం 13వ రోజున దట్టమైన అటవీ ప్రాంతంలో వెలసిన సిద్దేశ్వర ఆలయ సమీపంలోని పవిత్ర నీటి గుండాల్లో దేవతామూర్తులకు పవిత్ర స్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యం సమర్పించిన అనంతరం దేవతామూర్తులు ఆలయంలో కొలువుదీరాయి. 15వ రోజు సోమవారం భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించనున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దర్శనానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయంలో గిరిజనులే పూజారులుగా కనుల పండువగా జాతర నిర్వహిస్తారు.

మహిమ గల తల్లి



ఆలయంలో వెలసిన పురాతన గొంతెమ్మ తల్లి ఎంతో మహిమ కలది. పురాతన కాలం నుంచి ఆలయంలో మా కుటుంబానికి చెందిన వారమే పూజార్లుగా తల్లిని కొలుస్తున్నాం. ప్రాచీన సంస్కృతి, సాంప్రదాయాలతో ఆలయ ప్రాంగణంలో అమ్మవారికి మొక్కులు చెల్లిస్తున్నాం.

- మానెపల్లి రాజన్న, ఆలయ ప్రధాన పూజారి

డబుల్ రోడ్డు నిర్మాణం కలేనా?

- కోత్మీర్ నుంచి దహెగాం వరకు 12 కిలోమీటర్లు
- ఎన్నికలకు ముందే టెండర్లు కూడా పూర్తి
- ఇంకా ప్రారంభం కాని పనులు
- పట్టించుకోని అధికారులు



దహెగాం నుంచి కోత్మీర్ వరకు ఉన్న సింగిల్ రోడ్డు

దహెగాం: అంగట్లో అన్ని ఉన్నా అల్లుడు నోట్లో శని అన్న చందంగా మారింది దహెగాం నుంచి కోత్మీర్ వరకు రోడ్డు దుస్థితి. ఈ మార్గంలో సింగిల్ రోడ్డు ఉండడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాగజ్‌నగర్ నుంచి మండలంలోని కోత్మీర్ వరకు ఐదేళ్ల క్రితం రూ. 35 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మించారు. కోత్మీర్ నుంచి దహెగాం వరకు సింగిల్ రోడ్డు ఉండడంతో ఎన్నికలకు ముందు ఆర్అండ్‌బీ శాఖ నుంచి రూ.30 కోట్లతో 12 కిలోమీటర్ల డబుల్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. రోడ్డుకు టెండర్లు కూడా పూర్తి చేసినా పనులు మాత్రం ఇంకా ప్రారంభం కాలేదు. దీంతో డబుల్ రోడ్డు నిర్మాణం కలేనా..? అని మండల వాసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

రూ. 30 కోట్లు మంజూరు..

దహెగాం నుంచి కాగజ్‌నగర్ 30 కిలోమీటర్ల దూరంలో ఉంది. మండలం నుంచి నిత్యం వందలాది మంది వివిధ అవసరాల నిమిత్తం పట్టణానికి రాకపోకలు సాగిస్తుంటారు. 30 కిలోమీటర్ల రోడ్డు ఉండగా 2018లో అప్పటి ప్రభుత్వం కాగజ్‌నగర్ నుంచి మండలంలోని కోత్మీర్ వరకు రూ. 35 కోట్లతో 18 కిలోమీటర్ల మేర డబుల్ రోడ్డు నిర్మించింది. మిగతా 12 కిలోమీటర్లు కోత్మీర్ నుంచి దహెగాం వరకు సింగిల్ రోడ్డే ఉంది. ఇక్కడ కూడా డబుల్ రోడ్డు వేయాలని పలుమార్లు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు స్థానికులు విన్నవించారు. ఎట్టకేలకు ఎన్నికల ముందు డబుల్ రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వం రూ. 30 కోట్లు మంజూరు చేసింది. పనులను కరీంనగర్‌కు చెందిన ఓ కాంట్రాక్టర్ దక్కించుకున్నారు. టెండర్లు పూర్తయ్యి నెలలు గడుస్తున్నా ఇంకా పనులు ప్రారంభించలేదు.

ఆర్టీసీ బస్సు రాదు..

కాగజ్‌నగర్ నుంచి దహెగాం మండల కేంద్రం వరకు ఈ మార్గంలో సుమారు 15 గ్రామాలు ఉన్నాయి. ఈ రూట్‌లో ఆర్టీసీ బస్సు సర్వీసులు నడపడం లేదు. దీంతో ప్రజలు ప్రైవేటు వాహనాల్లో అధిక చార్జీలు వెచ్చించి ప్రయాణాలు చేస్తున్నారు. సింగిల్ రోడ్డుతో మూలమలుపులు ఉండడంతో ఆర్టీసీ బస్సులు నడపడం లేదు. సింగిల్ రోడ్డుపై ఎడ్లబండ్లు నిలిపి ఉంచడం, పశువులను కట్టేయడం వల్ల బస్సు నడపడానికి ఇబ్బందులు కలుగుతున్నాయని బస్సును నిలిపివేశారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

కోత్మీర్ నుంచి దహెగాం మండల కేంద్రం వరకు ఎన్నికల ముందే రూ. 30 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. పనులకు టెండర్లు కూడా పూర్తయ్యాయి. పనులు ఇంకా ప్రారంభం కాలేదు. పనులు ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటాం.

– లక్ష్మీనారాయణ, ఆర్అండ్‌బీ డీఈ

నాసిరకంగా నిర్మాణ పనులు

భీమిని: కన్నెపల్లి మండలంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో మరుగుదొడ్ల పనులు నాసిరకంగా నిర్మిస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. మరుగుదొడ్ల నిర్మాణ పనులను శనివారం పరిశీలించారు. నిర్మాణ పనుల్లో వాడుతున్న రాడ్, సిమెంట్ పనులు నాసిరకంగా ఉన్నాయని త్వరగా కూలిపోయే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి క్వాలిటీగా పనులు జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు.

ఘనంగా గోదాదేవి కల్యాణం

మందమర్రిరూరల్: పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గోదాదేవి రంగనాథుల కల్యాణం ఆలయ అర్చకులు గోవర్ధనగిరి అనంతాచార్యులు, నరసింహాచార్యులు కనుల పండువగా జరిపించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ప్రత్యేక పూజ చేశారు. కల్యాణానికి ఏరియా జీఎం దంపతులు మనోహర్ సవిత, అధికారులు హాజరై కల్యాణాన్ని తిలకించారు.

'క్రీడలతో మానసికోల్లాసం పెంపొందుతుంది'

లక్సెట్టిపేట: క్రీడలు మానసికోల్లాసాన్నిస్తాయని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాల మైదానంలో శనివారం బీజేపీ నాయకులు ఏర్పాటు చేసిన కబడ్డీ క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. సెలవుల్లో క్రీడలపై దృష్టి పెట్టాలని, క్రీడా పోటీలలో పాల్గొనే క్రీడాకారులు ఆత్మస్థైర్యాన్ని కలిగి ఉంటారన్నారు. గెలుపు, ఓటమి సహజమని ప్రతి ఒక్కరూ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. విజేత అయిన బజరంగ్ జట్టు క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథరావు, మండల నాయకులు హరిగోపాల్, మధు, కిషన్, జగన్‌మోహన్ రెడ్డి, ప్రభాకర్, శివశంకర్, పాంచాల రమేష్, గంగన్న పాల్గొన్నారు.

'సర్పంచుల పదవీకాలం పొడిగించాలి'



మాట్లాడుతున్న న్యానేశ్వర్

కెరమెరి: సర్పంచుల పదవీ కాలం ఈ నెల 31తో ముగియనున్న నేపథ్యంలో జూన్ 31 వరకు పదవీ కాలాన్ని పొడిగించాలని సర్పంచుల సంఘం మండలాధ్యక్షుడు కుమురం న్యానేశ్వర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదవీ కాలం విషయంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆయన కోరారు. నాయకులు జగన్నాథ్‌రావు, ఆదే నారాయణ, భీంరావు, బాలాజి, లాల్ శావ్ తదితరులు ఉన్నారు.

పర్సన్ ఇన్‌చార్జీలుగా కొనసాగించాలి

తిర్యాణి: సర్పంచ్‌ల ఎన్నికలు నిర్వహించే వరకు ప్రస్తుతం ఉన్న సర్పంచులనే పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా కొనసాగించాలని సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు మడావి గుణవంత్‌రావు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 2019 నుంచి కరోనా మహమ్మారితో అభివృద్ధి పనులు జరగలేదని, చేసిన పనులకు సైతం నేటికీ బిల్లులు రాకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

క్రీడలపై యువత ఆసక్తి చూపాలి



పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

రెబ్బెన: గ్రామీణ క్రీడలపై యువత ఆసక్తి చూపాలని ఎస్సై డి. చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని గోలేటి విలేజ్ బస్టాండ్ వద్ద శనివారం గోలేటి గ్రామ యూత్ ఆధ్వర్యంలో మండల స్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించారు. పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. అనంతరం పోటీలు ప్రారంభించారు. కార్యక్రమాల్లో సేవాలాల్ జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రవినాయక్, గ్రామపెద్దలు బలిరాం నాయక్, బిక్కు నాయక్, దుప్పా నాయక్, మాజీ జెడ్పీటీసీ అజ్మీర బాబురావు, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

కౌటాల: క్రీడల్లో గెలుపోటములు సహజమని సర్పంచ్ ఆదే శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ముత్తంపేట్ గ్రామంలో స్థానిక యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన జీపీ లెవల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు శనివారం ముగిశాయి. గెలుపొందిన ముత్తంపేజ్ జట్టుకు రూ. 25 వేల నగదు, రన్నరప్‌గా నిలిచిన ముత్తంపేట్ లెజండ్ జట్టుకు రూ. 15 వేల నగదుతో పాటు బహుమతులు అందించారు.